క్లుప్తంగా

ఘనంగా హనుమాన్ పల్లకీసేవ


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఆటాపాటలు, భజనలతో స్వామివారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాయికల్ మాజీ సర్పంచ్ ఆశన్నగౌడ్, గాయత్రి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, వసంతరావు, అన్నారం రఘు, రమేశ్, రఘునందన్‌రెడ్డి, నర్సింలు, క్యూసెట్ శ్రీనివాస్, లక్ష్మణ్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, యాదగిరి, గోరియా నాయక్, సుధాకర్, హన్మంత్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు


మాజీ ఎంపీపీ బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు


చేవెళ్ల: చేవెళ్లలో నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి పెద్దఎత్తున విరాళాలు అందిస్తున్నారు. శనివారం చేవెళ్లకు చెందిన మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్ ఆలయ నిర్మాణానికి అయ్యే స్టీల్ మొత్తం ఇప్పిస్తానని కురుమ సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కురుమ సంఘం సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా గుడిపల్లి నర్సింహ్మారెడ్డి లక్ష 50వేలు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి లక్ష రూపాయలు, అత్తెల్లి జగనాథ్‌రెడ్డి 50వేలు, సంతోషీమాత వేబ్రిడ్జి యజమాని వెంకట్‌రెడ్డి 51 వేల రూపాయలను కురుమ సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను వారు సన్మానించారు.

బాధిత కుటుంబానికి చేయూత


నగదు అందజేస్తున్న మహేశ్

షాబాద్: మృతుల కుటుంబాలకు చేయూతనిచ్చి అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మక్లీ మహేశ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన అప్పరెడ్డిగూడెం సత్యవతి ఆకస్మికంగా మరణించింది. దీంతో ఆయన బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తనవంతు సాయం ఇచ్చి ఆదుకుంటానని తెలిపారు. ఇప్పటివరకు 22 కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత మక్లీ వెంకటేశ్, గ్రామస్తులు ఎల్లేశ్, జంగయ్య, చాంద్‌పాషా, మధు, జంగయ్య, సురేందర్, శ్రీనివాస్, రమేశ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

వెయిటింగ్ హాల్ ప్రారంభం


గదిని ప్రారంభిస్తున్న జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయంలో వినియోగదారుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను శనివారం జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ ప్రారంభించారు. దాతల సహకారంతో వీటిని పూర్తి చేశామని ఆయన తెలిపారు. అలాగే వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణాశాఖ అధికారి సుభాష్‌చంద్రరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

సెలవులో తహసీల్దార్

- ఇబ్బందులకు గురైన క్రయవిక్రయదారులు
- ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదా అంటూ మండిపాటు



నందిగామ తహసీల్దారు కార్యాలయం

నందిగామ: చలాన్లు చెల్లించారు.. స్లాట్ బుక్ చేసుకున్నారు.. సాక్షుల కోసం కావాల్సిన వారిని తీసుకొచ్చారు.. క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌టైమ్‌కు హాజరయ్యారు. కానీ.. 'తహసీల్దారు సెలవులో ఉన్నారు ఈ రోజు రిజిస్ట్రేషన్లు చేయలేం' అని కార్యాలయ సిబ్బంది చెప్పడంతో అక్కడికి వచ్చినవారు అవాక్కయ్యారు. తహసీల్దారు సెలవులో ఉంటే ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికో ఒకరికీ ఇవ్వాలి కదా అంటూ సిబ్బందిపై మండిపడ్డారు. ఇది మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శనివారం పరిస్థితి. నందిగామ తహసీల్దారు కార్యాలయంలో భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరుగుతూ ఉంటాయి. యథావిధిగా శనివారం రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ముందుగానే పలు సమయాల్లో 10 మంది భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన స్లాట్‌ను బుక్ చేసుకున్నారు. వారు బుక్ చేసుకున్న సమయంలో క్రయవిక్రయదారులతో పాటు కావాల్సినంత మంది సాక్షులను సైతం తీసుకొచ్చారు. డాక్యుమెంట్లను తీసుకొని కార్యాలయంలోకి వెళ్తే.. సారీ.. ఈ రోజు తహసీల్దారు సెలవులో ఉన్నారు. మీ రిజిస్ట్రేషన్ ఈ రోజు చేయలేం అని కార్యాలయ సిబ్బంది చెప్పడంతో క్రయవిక్రయదారులు మండిపడ్డారు. ఇదేంటి తహసీల్దారు సెలవులో ఉంటే ఇన్‌చార్జి ఎవరూ లేరా అని సిబ్బందిని నిలదీశారు. బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదని సిబ్బంది చెప్పడంతో విక్రయదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎక్కడి నుంచో వచ్చామని, ముందుగానే తమకు వీలైన సమయంలో స్లాట్ బుక్ చేసుకున్నామని, భూములు విక్రయించే వారికి పూర్తి సొమ్ము చెల్లించామని, తీరా కార్యాలయంలోకి వస్తే తహసీల్దారు లేరని చెప్పడం ఎంతవరకు సమంజసమని వారు నిలదీశారు. ఏ కార్యాలయంలో అయినా ఒక్క అధికారి సెలవులో ఉంటే మరో అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ నందిగామ తహసీల్దారు కార్యాలయంలో వింత సంఘటన చోటు చేసుకోవడం గమనార్హం.

ఎన్నికల కోడ్‌తో నగదుతో ఇబ్బంది..

ఎన్నికల కోడ్ ఉన్నందున నగదు లావాదేవీలు చేసుకునేందుకు వీలు కాలేకపోవడం ఒక సమస్య అయితే, భూముల అగ్రిమెంటు గడువు ముగిస్తే భూముల విక్రయదారులతో మరో సమస్య ఉంటుందని వాపోయారు. ఎలాగైనా రిజిస్ట్రేషన్ చేసుకుందామని వెళ్తే తహసీల్దారు సెలవుతో ఉన్నారని సిబ్బంది చెప్పడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

తీరుమారని రెవెన్యూ..

కొంతకాలంగా నందిగామ తహసీల్దారు కార్యాలయంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు మండలంలోని సీలింగ్, దేవాదాయ భూములను సైతం అక్రమంగా గతంలో రిజిస్ట్రేషన్లు చేశారనే విమర్శలు ఉన్నాయి. అయినా కూడా రెవెన్యూ సిబ్బంది తీరు మారకపోవడంపై వారి పనితీరు అర్థం అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి నందిగామ తహసీల్దారు కార్యాలయంలో జరుగుతున్న అక్రమాల గురించి, అధికారులు సెలవులో ఉంటే ఇతర అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతల విషయమై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్పందించని తహసీల్దారు..

ఈ విషయమైన తహసీల్దారు రాజేశ్వర్‌ను వివరణ కోరేందుకు పలుసార్లు ఫోన్‌లో సంప్రదించగా ఫోన్ తీయలేదు.

మీటింగ్‌లో ఉన్నా: ఆర్డీఓ

ఈ విషయమై షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావును వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా మీటింగ్‌లో ఉన్నా అని ఫోన్ కట్‌చేయడం గమనార్హం. రెవెన్యూ అధికారుల తీరు జవాబుదారీతనం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

“ స్లాట్ బుక్ చేసుకున్నాం



భూమి రిజిస్ట్రేషన్ కోసం మూడురోజుల ముందే స్లాట్ బుక్ చేసుకున్నాం. రిజిస్ట్రేషన్ కోసం వస్తే తహసీల్దారు లేరని చెప్పడం దారుణం. తహసీల్దారు సెలవులో ఉంటే ఇన్‌చార్జి బాధ్యతలు మరో అధికారికి ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసం. స్లాట్ బుక్ చేసుకుంటే నిర్ణీత సమయంలో రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడం ఎందుకు.

– జంగిలి, యాదయ్య, నర్సప్పగూడ

ఇందిరమ్మ రాజ్యాన్ని నిర్మించుకుందాం

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్

మొయినాబాద్‌రూరల్: ఇందిరమ్మ రాజ్యాన్ని నిర్మించుకోవడానికి అందరం కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, జిల్లా వడ్డెర సంఘం నాయకుడు అజీజ్‌నగర్ వడ్డె సత్తయ్య అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు భీంభరత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపాలనను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాకారం మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎన్కెపల్లి భిక్షపతి, అజీజ్‌నగర్ వడ్డె రాంచందర్ పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భీంభరత్

నీటి సమస్య లేకుండా చూడాలి

డీపీఓ సురేశ్‌మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌మోహన్

చేవెళ్ల: గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఓ సురేశ్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు గ్రామాల్లో సక్రమంగా సరఫరా అవుతుందా లేదా ఎప్పటికప్పుడూ సమీక్షించుకోవాలన్నారు. భగీరథ నీరు సరిపోని గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. వేసవి కాలం ముగిసే వరకు గ్రామాల్లో నీటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో ఉన్న తాగునీటి బోరుబావులను గుర్తించాలన్నారు. ప్రజలకు అందుబాటులో నీటి వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులే ఆయా గ్రామాల బాధ్యతలు చూసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్క అధికారి పర్యటించాలన్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడూ తెలుసుకుంటేనే వెంటనే పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే విధంగా కార్యదర్శులు శ్రమించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఎల్‌పీఓ సతీష్, ఎంపీడీఓ వెంకటయ్యగౌడ్, పంచాయతీ అధికారి గీత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్


ఆలయంలో పూజలు చేస్తున్న శ్రీనివాస్

కేశంపేట: ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుడుపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు భక్తిశ్రద్ధలతో దైవ కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. దైవచింతన కలిగి ఉండటంతో ఒత్తిడి తగ్గుతుందన్నారు. అదేవిధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్, జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రమేశ్, శివకుమార్, శ్రీనివాస్, రాఘవేందర్ యాదవ్, విష్ణు, రాజు, గ్రామస్తులు రాజునాయక్, జగన్‌నాయక్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగికి పదవీ విరమణ సహజం


భీమ్‌రెడ్డి దంపతులకు షీల్డ్ బహూకరిస్తున్న నర్సిరెడ్డి, తదితరులు


రవీంద్రనాథ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

మొయినాబాద్‌రూరల్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తోల్‌కట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసిన భీమ్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తోల్‌కట్ట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయగా వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య భీమ్‌రెడ్డి సమత దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు వీడ్కోలు సన్మానంలో షీల్డ్‌లను బహూకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా పదవీ విరమణ అనేది సహజమేనని పేర్కొన్నారు. విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తూ అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేశానని భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. యూటీఎఫ్ సంఘంలో బాధ్యులుగా పని చేశానన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, మాణిక్‌రెడ్డి, తోల్‌కట్ట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నార్సింగి హెచ్‌ఎం విజయ్‌కుమార్, అజీజ్‌నగర్ పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్, సుధాకర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వెలిజర్ల ప్రాథమిక పాఠశాలలో..

షాద్‌నగర్‌రూరల్: విధి నిర్వహణలో ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎంఈఓ శంకర్ రాథోడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కర్ణకోట రవీంద్రనాథ్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం శైలజ ఆధ్వర్యంలో కర్ణకోట రవీంద్రనాథ్‌కు ఉద్యోగ విరమణ, అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు సామాజిక సేవను అలవర్చుకొని సమాజానికి ఆదర్శంగా నిలబడాలన్నారు. రవీంద్రనాథ్ ఉపాధ్యాయుడే కాకుండా మంచి సాహిత్యకారుడన్నారు. ఉద్యోగ విరమణ తరువాత సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. రవీంద్రనాథ్ శేష జీవితం పిల్లాపాపలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు. అనంతరం కర్ణకోటరవీంద్రనాథ్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిష్టప్ప, జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి, కార్యదర్శి నాగేశ్వర్‌రావు, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బాలయ్య, తపస్ నాయకులు వెంకట్‌రెడ్డి, తావుర్యానాయక్, జయమ్మ, తిరుమలయ్య, అర్జునప్ప, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గీతారాణి, ప్రహ్లాదరావు, శివాజీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్ సౌకర్యం

కొందుర్గు: కొందుర్గు పెండ్యాల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయానికి శనివారం ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు లూర్దునగర్ సమీపం నుంచి ఆరు స్తంభాలతోపాటు 15 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే శంకర్‌కు, ట్రాన్స్‌కో అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామయ్యగౌడ్, కృష్ణయ్య, నర్సింలు, బాల్‌రాజ్, నరేందర్‌గౌడ్, శ్రీశైలం, మల్లేశ్, భరత్, వేణుగోపాల్ పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్న ట్రాన్స్‌కో సిబ్బంది, గ్రామస్తులు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ సాయిరాం, తదితరులు

ఆర్డీఓ సాయిరాం

చేవెళ్ల: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చేవెళ్ల అసెంబ్లీ స్థాయిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ముందుగా మానవహారం నిర్వహించి శంకర్‌పల్లి నుంచి షాబాద్ చౌరస్తా వరకు ఈ రన్‌ను రెవెన్యూ, పోలీస్ అధికారులు యువతతో కలిసి నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో బూత్ లెవల్ అధికారులు ఉంటారని లేదా ఆన్‌లైన్‌లో నేరుగా కూడా ఓటరు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఓటరు జాబితాలో కూడా ఓటర్ల పేర్లు ఉన్నాయో లేదా, ఏదైనా తప్పులు ఉంటే అడ్రస్‌లు మారితే కూడా వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్‌లోని ఆయా మండలాల తహసీల్దార్లు గౌతమ్ కుమార్, కృష్ణయ్య, పోలీస్ అధికారులు సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి సభ్యుల సహకారం



మాట్లాడుతున్న పాండు రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైర్మన్ ఎడ్వుల్ల పాండు రంగారెడ్డి కోరారు. శేరిగూడలోని పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. అన్నదాతలకు ఎప్పుడూ తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. సంఘం అభ్యున్నతికి సభ్యులంతా పాటుపడాలని సూచించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రైస్‌మిల్లును త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. కాగా లాభాలు, ఖర్చులు, రుణాలు తదితర సంబంధిత అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఈఓ గణేశ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు. యువకులు కేరింతలు కొడుతూ ఉత్సాహభరితంగా రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, కార్య నిర్వాహకులు రంజిత్‌రెడ్డి, మధుకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, శంకర్, శంకర్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు కృష్ణగౌడ్, స్వామిగౌడ్, సిబ్బంది ఆంజనేయులు, జంగయ్య, మల్లేష్, జగ్గారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. అందులో భాగంగా శనివారం తుర్కయంజాల్‌లోని 12వ వార్డు కౌన్సిలర్ కీర్తనవిజయానందరెడ్డితో కలిసి ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. 30 మంది సిబ్బందితో ఏపీనగర్, వింటేజ్ హోమ్స్, ఆదిత్యానగర్, టీచర్స్‌గిల్డ్ కాలనీ, కుర్మగూడలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌ను ఒకేసారి ఉపయోగించవద్దని ప్రజలకు సూచించారు. చెత్తను ఆరు బయట వేయొద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాగేశ్, ఈఈ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564